# ప్రశ్నార్థకం

నిజంగానే - చెప్పొద్దూ - ఆ సంగతి వినేసరికి మధుమూర్తికి ఒళ్ళు మండుకొచ్చింది. తనకిఘోరమైన అన్యాయం జరిగిపోయినట్టూ, తన జీవితంలో మున్నెన్నడూ కలుగనంతటి మహా విపత్తు కలిగినట్లూ, నిష్కారణంగా తన యావదాస్తీ అన్యాక్రాంతమైనట్లూ గిజ గిజలాడిపోయాడు. యిదిలా ఎందుకు జరిగింది; ఏ పరిస్థితిలోనూ యిలా కావడానికి వీల్లేదే! తన ప్రయత్నం సఫలం కావచ్చు కాకపోవచ్చు - అది వేరే మాట. కాని తను చిత్తుగా ఓడిపోయిన కేసులో ఆ చిదంబరం గాడికి ఘనవిజయ మేమిటి; వాడు వాడి మొహం పెట్టుకుని ఆ చిదంబరంగాడు పెద్ద హీరో అయిపోవడమా ఈ ఊళ్ళో తనుండగా !

వాడు తనకంటే ఎందులో గొప్పని, అసలు వాడి మొహంలో జీవకళ ఉందా ఉత్త చలిమిడిముద్ద మొహమూ వాడూనూ. పోనీ తెలివి తేటలేమైనా వున్నాయంటే వాళ్ళ

అమ్మమ్మ చెప్పినట్లు బుర్రలో వున్నదంతా రాగిమన్నేకదా! తనలాగ బి. ఏ. అయినా కాదాయె! ఒట్టి వానాకాలం చదువు, ఇవన్నీ లేవు. సరేనయ్యా, ఆడది వ్యామోహంలో పడడానికి అందం, చదువూ, తెలివీ ఇవన్నీ కావాలేవిటి మనిషి దగ్గర ధైర్యం, బలం, చొరవ, మాటకారితనం వగైరా ఏవో కొన్ని ఉంటే చాల్దేమిటి? అని సరిపెట్టుకుందాం అంటే, రామ రామ వాడిదగ్గర యిందులో ఒక్క లక్షణం కూడా లేందే! ఆడదాన్ని చూస్తేనే ఆమడ దూరం పరిగెడతాడు. యిక మాటకారి తనమా - నా మొహం. అసలు నోట్లోంచి మాట ఊడిపడదే - ఓ ఆడపిల్లని సరదాగా ఏడిపించడం కాని, పల్లిగ్గా ఓ జోకు విసరడం గాని చాటుగా ఓ చెయ్యి పట్టుకోవడంగాని ఏమైనా చేసి ఏడిచాడా వాడు యింత క్రితం; ఒట్టి వాజమ్మ - చవట - నాప.

అలాంటి చచ్చు చిదంబరంగాడు ఊరికంతటికీ అందగత్తె అయిన కల్పవల్లికి, అదే, తన చీటీల్నీ, రాయబారాల్నీ, చెరువుదగ్గర చెయ్యిపట్టుకోడాల్నీ విసిరికొట్టిన పెంకి రాలుగాయి రాతి హృదయానికి, నీటిలో నీడలుతీసి ఉప్పా లేకుండా ముప్పందుంతాగే ఆమహాస్వారీ మునెయ్యామూడో భార్యకి, రోజూ కలలో కన్పించి తనని ముప్పా తిప్పలు పెడుతూన్న ఆ ముద్దుగుమ్మకి అనుంగు చెలికాడై క్షణం విడిచి వుండలేని ప్రియతమ ప్రేమికుడై, ఇవాళ విరాజిల్లుతుండడమా! ఇంతకంటే అన్యాయం. ఘోరకలి, అవమానం ఇంకేమైనా ఉందా!

వీల్లేదు, ఈ సంగతేదో తేల్చెయ్యాలి తనలాంటి రసికుణ్ణి త్రోసిరాజనడానికీ చిదంబరంలాంటి శుద్ధమొద్దావతారాన్ని దగ్గరగాతీసి ఆదరించడానికి ఏమిటి కారణం; అవమానించడానికి కాకపోతే మరెందుకు: ఈ సంగతేదో తేలుస్తాడు - తేల్చేస్తాడు.

“ఇలా ఎడం అరచేతిలో కుడి గుప్పిట వేసుకుని, సినీ డైరెక్షను ప్రకారం గ్రుద్దుకొని, తలనోమారు సాభిప్రాయంగా పంకించి, లేని మీసాన్ని వున్నట్లు భావించి మెలివేసి, పెద్ద పెద్ద అంగలు వేస్తూ బయలుదేరిన మధుమూర్తికి వారం రోజుల వరకూ ఆ సంగతి తేల్చెయ్యడం అంటే ఏమిటో తేలిస్తే ఎలా తేల్చాలో ఎంత బుర్ర బద్దలు కొట్టుకున్నా తేలలేదు.

ఈ లోగా తన మనస్సులో పాతిక సార్లయితే చిదంబరాన్ని చితకా మతకా తన్నాడు. ఓ ఏభై సార్లు కల్పవల్లిని నగ్నంగా నుంచోబెట్టి అవమానించాడు. యింకో పదిసార్లు కసిగా కల్పవల్లి చిదంబరాల శృంగారాన్ని వర్ణించి చెప్పి మునెయ్య హృదయంలో కోపానల జ్వాలలు రేపాడు.

ఏం చేసినా మధుమూర్తికి మానసికమైన తృప్తి లభించలేదు. తను ఇంకా ఏదో తేల్చెయ్యాలి - అంతు కనుక్కో—...వాలి.. కక్ష తీర్చుకోవాలి...హమ్మయ్య అని విశ్రాంతి తీసుకోవాలి. అంతవరకూ తనకు శాంతి లేదు - లేదు గాక లేదు.

దెయ్యం పట్టిన వాడిలాగ, అన్నం సరిగా తినక, కంటినిండా నిద్రపోక. స్థిమితంగా ఏ విషయం ఆలోచించలేక

స్థిరంగా ఎక్కడా నిలబడలేక ఆగమ్మ కాకిలాగ ఊరంతా వానాలప్ప తిరగసాగాడు. ఆవేశంతోనూ అసహనంతోనూ ఒళ్ళంతా వేడెక్కిపోయి నప్పుడల్లా మాత్రం వెళ్ళి చెర్లో ఓ ములుగు ములిగి చక్కా వస్తున్నాడు.

ఇలా వేళా పాళా లేని స్నానాలు ప్రారంభించిన మధుమూర్తికి, ఓరోజున వేళకాని వేళలో, చెరువుకి ఎవరూ రాని సమయంలో, కల్పవల్లి ఏకాంతంగా తటస్థపడింది. గుండెల లోతు నీళ్ళల్లో మధుమూర్తి స్నానం చేస్తున్నాడు. రెండో మెట్టుమీద, నీలమండలు తడిసేచోట కల్పవల్లి ఆగిపోయి బిందెలోంచి బట్టలుతీసి తడుపుతోంది. ఆమె కనిపించగానే అందులో ఒంటరిగా, మధుమూర్తి కోసం తారస్థాయిని చేరుకుంది. ఆ ... ఉన్మాత్యగా తను తేల్చాలనుకుంటున్న దేవిటో ఇప్పుడు తేల్చెయ్యాలి...

అయినా తేల్చేదేమిటి?.. ఎలాగ?...ఎవిటి నువ్వు నా కోరికని కాదన్న దానివి, చిదంబరాన్ని ఎందుకు ఆదరిస్తున్నావు అని అడుగుతాడా? లేకఆ చిదంబరరం ఏమిటి - వాడిని పంపించేసి నన్ను ఏలుకో అంటాడా? అసలు నువ్వు ఇలా ఎందుకు చేయవలసి వచ్చింది. చిదంబరం నాకంటే ఎందులో ఘనుడు అంటూ వాదన వేసుకుంటాడా? అయినా తను ఏమని అడుగుతాడు? అడగడానికి తనకి అధికారం ఏంవుంది? ఆమె యిష్టం ఆమెది. ఆమాటే అంటే? పోవోయ్ నా యిష్టం నాది. నువ్వెవడివి నన్ను అడగడానికి, ఆ చిదంబరం నచ్చాడు. నువ్వు నచ్చలేదు" అని కుండ బద్దలుకొట్టినట్లు మొహంమీద అనేస్తే? అంతకంటే అవమానం ఇంకేమైనా ఉందా తన ఇన్నేళ్ళ శృంగార జీవితానికీ?

అయితే మరేమిటి చెయ్యడం? ఏ సంగతీ తేల్చకుండా ఇలా వాజమ్మలా ఒదిలెయ్యడమే!

అప్పుడే కల్పవల్లి బట్టలు ఉతుక్కోవడం పూర్తి చేసింది. ఇంకేముంది? ఒక్క ములుగు ములిగి, పిండినబట్టలు బుజాన్న వేసుకుని బిందె చంకనెట్టుకుని చక్కాపోతుంది. అది కాస్తా జరక్కముందే ఈ సంగతేదో తేల్చేయాలి...

మధుమూర్తి ఒళ్లు తోముకొనే వంకతో నెమ్మదిగా నీళ్ళలోంచి బయటకి వచ్చాడు. కల్పవల్లి నడుంలోతు నీళ్ళలో కూర్చుని దోసిళ్ళతో ఒంటిమీదా ముఖంమీదా నీళ్లు పోసుకుంటోంది. ఇదే అదనని దగ్గరగా వెళ్ళి "ఏం బాగున్నావా? ఈ మధ్యన అసలు కన్పించడమే లేదు" అంటూ మాట కలిపాడు మధుమూర్తి, కల్పవల్లి ఆ మాట విందేమో కాని విననట్లు నటించింది.

కాస్సేపాగి "పూర్వం ఎప్పుడైనా పలకరిస్తే అధమం సమాధానం అయినా చెప్పేదానివి. ఇప్పుడదికూడా లేదు. నా మీద కోపం వచ్చిందా" అన్నాడు.

కల్పవల్లి అతనికేసి కోరగా చూసింది.

మధుమూర్తి కొంచెం తగ్గాడు! కాని అతనికేవాళ ఆ అవకాశం పోనివ్వడం ఇష్టంలేదు. సంగతేదో తేల్చేయాలి. అందుకే కాస్త ధైర్యం పుంజుకుని "చిద బరంపాటి అదృష్టానికి నోచుకోలేదా నేను?" అన్నాడు కొంటెగా చూస్తూ

కల్పవల్లి ఒక్కమారు విసురుగా లేచింది. బిందె అందుకుని హడావిడిగా నీళ్లు ముంచి ది.

"పోనీ ఈ సంగతేనా చెప్పు - నా మీద ఎందుకు కోపంగా ఉంటున్నావు? నేనేం తప్పుచేశానని?

బిందె చంకని ఎత్తుకుంటూ "సిగ్గులేక పోతేసరి-చను వుగా మాట్లాడేనని నీ ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తావా? నేను వీధిన వెళుతూంటే విజిల్స్ వేసి రకరకాలైన వ్యాఖ్యానాలు చేసి ఆఖరికి చెరువుకి వచ్చినప్పుడు చెయ్యి పట్టుకుంటావా? నీ పోకిరీ వేషాలు ఎవరికంటైనా పడితే నా కాపురం ఏమై పోతుంది?...పైగా అడుగుతున్నాడు ఏం తప్పు చేశానని? ..."హుఁ!" అంటూ చీదరించుకుని పిండిన బట్టలు బుజం మీద వేసుకుని బయలుదేరింది కల్పవల్లి.

ఆమె అలా మొహంమీద దులిపేసే సరికి మధు మూర్తికి ఒళ్ళు మండుకొచ్చింది. వెంటనే తనూ కోపంతో రెచ్చిపోయి "మహా పతివ్రతలా కబుర్లు చెబుతున్నావు, ఆ చిదంబరం సంగతేవిటి? అన్నాడు గట్టిగా.

ఆ మాటకి కల్పవల్లి నిస్తేజురాలై పోయింది. మధు మూర్తికేసి తెల్లబోయి చూసింది. చేతులు కాళ్లు వణికేయి. కాని అంతలోనే నిలదొక్కుకుని ధైర్యం పుంజుకుని "అతని గొడవ నీ కెందుకు? అతను నీలాగ పోకిరివాడు కాదు. అరిచి ఇకిలించి విజిల్స్ వేసి ఆడదాని బ్రతుకుని బజార్న పడేసేం దుకు" అంటూ అడుగు కదిపింది.

ఆ మాటకి వెటకారంగా "అంటే వాడు ఎంత బుద్ధాయి అయినా గుట్టు దాచేమనిషి అయితే చాలన్న మాట నీకు?" అన్నాడు మధుమూర్తి.

కల్పవల్లి సమాధానం చెప్పలేదు.

మధుమూర్తి పగఇంకా చల్లారలేదు. మాటలతో ఆమె గుండెలు చీల్చాలనుకున్నాడు. వికటంగా నవ్వి "అల్లరి అవుతుందనా అమాయకుణ్ణి చేరదీశావు?" అన్నాడు.

ఆమెకి అసహ్యమేసింది. ఆమాటలు వింటే... "ఆ... అర్థమైందా ఆడదాని మనస్సు? ఇంక దయచెయ్యి" అని వెటకారంగా అని విసురుగా తలతిప్పి అడుగు వేసింది.

మధుమూర్తి అంతటి అవమానం లభిస్తుందని ఊహించుకోలేదు. అందుకు సిద్ధంగానూ లేడు. అందుకే ప్రళయ రుద్రుడయిపోయి "చిదంబరం సంగతి మునెయ్యకి తెలిస్తే..." అని అర్థోక్తిలో ఆగిపోయాడు.

"చెప్పుకోవోయ్ నాకేం భయంలేదు" అనే భావం వచ్చేటట్లు నిర్లక్ష్యంగా విసురు విసురుమంటూ వెళ్ళిపోయింది కల్పవల్లి.

కక్షతోటీ అసూయతోటీ నిలువెల్లా కాగిపోతూ కోపంతో ఊగిపోతూ చెరువుగట్టున ఆ మట్టునే ఉండిపోయాడు మధుమూర్తి. కొంతసేపయాక తలపంకించి "చూస్తాను, చూస్తాను. ఈ మధుమూర్తిని కాదని ఆ చిదంబరంతో కులకడం ఏమిటో నేనూ చూస్తాను. మునెయ్య చెవిని వేస్తే తెలుస్తుంది. అమ్మాయిగారి పస" అని వికటంగా తనలో తను నవ్వుకుని ఒళ్లు తుడుచుకున్నాడు.

ఆ తర్వాత నెల్లాళ్ళదాకా మునెయ్య ఏకాంతంగా కలుసుకోవడం పడలేదు మధుమూర్తికి. ఒకరోజున వాకబు చేస్తే చేనుకి నీరు పెట్టడంకోసం పొలం పోయాడని తెలిసింది.

మరో మారు ఇంట్లోనే ఉన్నాడు కాని లోపల హాల్లో కల్పవల్లితో మాట్లాడుతున్నాడు. ఇంకోమారు వెళ్ళిచూస్తే ఊళ్ళో పెద్దలతో కబుర్లు చెబుతున్నాడు. ఓసారి పాలేళ్ళ మీద కేకలేస్తూ కూలివాళ్ళకి పనిపురమాయిస్తూ మాంచి హడావిడిగా ఉన్నాడు.

ఇలా ప్రయత్నించగా ప్రయత్నించగా ఓ రోజున అవకాశం దొరికింది మధుమూర్తికి మునెయ్యతో సావకాశంగా మాట్లాడడానికి.

కొద్దిగా చీకటి పడుతోంది. కల్పవల్లి శ్రావణ మంగళవారం పేరంటానికి కాబోలు వెళ్ళింది. మునెయ్య ఒక్కడూ అరుగుమీద వెడల్పాటి పొగాకు కాడల్ని కుంపటిమీద వెచ్చచేస్తూ కూర్చున్నాడు. పక్కనే సున్నండబ్బా, పొడుం కాయ, మట్టిమూకుడూ, గుండ్రని పొన్నువున్న లావాటి చేతికర్రా ఉన్నాయి. స్తిమితంగా ఉన్నాడు మునెయ్య. ఇదే అదననుకొని చెప్పులు అరుగుకిందవున్న చీడీల దగ్గరే వదలి "ఏమిటి మామా పొడుం చేస్తున్నావా!" అంటూ దగ్గరికి చేరాడు మధుమూర్తి.

మునెయ్య తలెత్తి చూడలేదు పొగాకుకాడ మాడకుండా నిప్పులమీద ఇటూఅటూ తిరగవేస్తూ గొంతునుబట్టి ఆనమాలుపట్టి "మరే అబ్బాయి - రా-ఏమిటీ మధ్య మరీ నల్లపూస అయిపోయావు. కనపించడమే మానేశావు" అన్నాడు.

మధుమూర్తి మరింత దగ్గరిగా జరిగి కూర్చుంటూ "నేనూ కాల్చనా" అంటూ అతని చేతిలోకాడ అందుకోబోయాడు. కాని మునెయ్య అతణ్ణి వారించి "వద్దులే కుర్రాడివి నీకు తెలియదు. దీన్ని ఒక పదునులో కాల్చాలి" అంటూ కొద్దిగా మధుమూర్తి ముఖంలోకిచూసి "చూశావ్ పసుపుపెళ్లాం, పొగాకుకాడ ఈ రెండూ ఉన్నాయే, వీటిని ఓ వాళంలో తిప్పుతూ ఉండాలి, మరీ వేడి చూపించకపోతే పచ్చిగా ఉంటాయి. ఎక్కువగా కాలిస్తే మాడి ఊరుకుంటాయి" అన్నాడు. ఆమాటలు అంటున్నప్పుడు సగం నెరిసిన మునెయ్య మీసాల వెనుకనుంచి సన్నని నవ్వు ఒకటి కనిపించింది మధుమూర్తికి.

"ఇంత గడుసువాడివే నేమిటి కల్పవల్లి ఆవరసన చిదంబరంతో తిరుగుతూ ఉంటే కానుకోలేక పోతున్నావు" అనుకున్నాడు మధుమూర్తి మనస్సులో.

ఎర్రగా కాలిన పొగాకు కాడల్ని తీసి, పాయ చీల్చడానికి వీలులేక, దూసి, పెళపెళ విరుగుతూన్న పొగాకు ముక్కల్ని మట్టిమూకుడులో వేస్తున్నాడు మునెయ్య.

"నాకో విషయం చెప్పు మామా" అన్నాడు మధుమూర్తి "ఏమిటి" అన్నట్లు చూశాడు మునెయ్య.

భర్తకి ద్రోహం చేస్తూన్న ఆడదాన్ని క్షమించవచ్చు అంటావా ?"

"ద్రోహం అంటే..."

"అదే... మరో పురుషుడితో తిరగడం

"ఓ...అదా ?"

"కత్తైడైతే నరికేయ్యవద్దూ ?"

మునెయ్య ఏం సమాధానం చెప్పలేదు.

"మెళ్ళో తాళిగట్టిన మొగుడి కళ్ళుగప్పి తన ప్రియుడితో కులుకుతూన్న ఆడదాన్ని ఏం చేసినా పాపం లేదంటాను. ఏవంటావు ?"

మునెయ్య నవ్వి "ఏవిటివాళ ఇలా మొదలెట్టావు! ఏమైందేవిటి !" అన్నాడు.

"నా ప్రశ్నకి ముందు సమాధానం చెప్పు."

"ఆ...ఏముంది, ఆడదాని వ్యభిచారం సంగతి ఆఖర్న తెలిసేది భర్తకే. ఎంతమందికి తెలిసినా వాడికి మాత్రం తెలియకుండా అది జాగ్రత్త పడుతుంది. అందువల్ల వాడికి ఓ పట్టాన తెలియదు. తక్కినవాళ్ళకి ఎంతమందికి తెలిసినా వాళ్ళెవరూ దాన్నేం చెయ్యలేరు."

"ఒకవేళ నాలాంటిబోటిగాడు ఆ భర్తకి చెప్పాడే అనుకో - అప్పుడు ;"

పొన్నకర్రతో కాలిన పొగాకుని మూకుట్లో తాపీగా నూరుతూ "చెపితే చెప్పొచ్చు" అన్నాడు మునెయ్య నిర్లిప్తంగా.

అప్పుడు వాడేం చెయ్యాలంటావ్ ;" ఉద్రేకంగా అడిగాడు మాఘమూర్తి.

"ఏదైనా చెయ్యవచ్చు మూర్ఖుడైతే "ఆ...అంతపని జరిగిందా" అంటూ పెళ్లాన్ని కొట్టి తిట్టి పెద్ద అల్లరిచేసి

తను అల్లరి పడొచ్చు. లేదా కాస్త లోకజ్ఞానం ఉన్నవాడైతే మనస్సు సరిపెట్టుకుని తనకా విషయం తెలియనట్లే ప్రవర్తించవచ్చు.

"అదేవిటి మావా అలా చెప్తావు: ఉచ్చం నీచం పౌరుషం అభిమానం వున్నవాడెవడేనా తనకి పట్టనట్టు ఊరుకో గలడా!"

"అది వాళ్ళ వాళ్ళ మనస్తత్వాన్నిబట్టి వుంటుంది. అబ్బాయ్! నాలాంటి బోటిగాడున్నాడనుకో - వాడి భార్య నువ్వన్నట్లే ప్రవర్తించిందనుకో - అప్పుడు వాడేం చేస్తాడో తెలుసా;"

"ఊ...ఏం చేస్తాడు?" గొంతులో వేయి ఆదుర్దాల్నీ, కళ్ళల్లో లక్ష కంగారుల్నీ, ముఖంలో కోటికోట్ల అలజడుల్నీ కనపరుస్తూ, మునెయ్యకి మరింత దగ్గరగా జరిగి, అతని ముఖంలోకి ఆసక్తిగా చూస్తూ అడిగాడు మధుమూర్తి.

మనస్సు సరిపెట్టుకుని ఊరుకుంటాడు."

"వ్హాట్!" గట్టిగా అరిచాడు మధుమూర్తి.

"అవును ఏదైనా మనస్సులోనూ దాన్ని సరిపెట్టుకోవడంలోనూ ఉంది అబ్బాయ్!" ఆ స్త్రీ తన భార్య ఆమెతో ఇంకో పురుషుడు ఆనందిస్తున్నాడు అనుకుంటే రక్తం ఉడుకుతుంది. అశాంతి పెరుగుతుంది. కాని అదే తన భార్యకాదు. వాడిభార్యే వాడిభార్యతోటే తను కాపురం చేస్తున్నాడు అని అనుకున్నాడో రక్తపుపోటూ లేదు. అశాంతిలేదు. పైగా బోలెడంత ఉత్సాహం – ఉల్లాసం. ఏమంటావు" అంటూ మునెయ్య గంభీరంగా మధుమూర్తి ముఖంలోకి చూశాడు.

"ఓరి చచ్చుపీనుగా! చివరికి ఇలా సరిపెట్టుకున్నా వన్నమాట - నిన్నూ నీ వేదాంతాన్నీ తగలేసిరి" అనుకుంటూ అసహ్యంగా మునెయ్యకేసి చూశాడు మధుమూర్తి.

"అవును ఇంతకీ నువ్వు చెప్పదలకున్న దేమిటి?" అన్నాడు మునెయ్య మెత్తగా నూరిన పొడుంను కొద్దిగా వేళ్ళతో తీసికొని రెండు ముక్కు పుటాల్లోకీ దట్టిస్తూ.

"ఇంక చెప్పేదేవిటి నీ ముఖం నా ముఖం" అనుకున్నాడు మధుమూర్తి.

ఓడిపోయినట్లు జీవకళ అంతా తరిగిపోయి, నీరసంగా ఉసూరుమంటూ ఉన్న మధుమూర్తి ముఖంలోకి చూసి నవ్వుకుని "చాలా శ్రమపడినట్లున్నావు ఒక్కపట్టు పీలుస్తావేమిటి;" అన్నాడు మునెయ్య అంగోస్త్రంతో ముక్కు తుడుచుకుంటూ.

మధుమూర్తికి ఒళ్ళు మండిపోయింది. "ఓరి ముసలి నక్కా! అసలు సంగతి యిదిరా నీ భార్యే ఆ చిదంబరం గాడితోటి కులుకుతోందిరా! అది చెప్పడానికే వచ్చానురా పిచ్చిపీనుగా!" అని చెప్పేద్దాం అనుకున్నాడు. కాని యింతలో మునెయ్య "వచ్చావా కల్పవల్లి - రా - మధుమూర్తి రాక రాక ఇన్నాళ్ళకి మన యింటికి వచ్చాడు. వచ్చి అంటాడూ... నేను చెప్పడం ఎందుకు; నువ్వే చెప్పు అబ్బాయ్" అన్నాడు.

మధుమూర్తి గతుక్కుమన్నాడు.

వెనక్కి తిరిగి చూస్తే పేరంటంనుంచి అప్పుడే తిరిగి వచ్చి చీకిలు ఎక్కుతూన్న కల్పవల్లి జరీ పట్టు చీరలో,

కాళ్ళకి రాసిన పసుపూ మెడకి పూసిన గంధం ఘుమఘుమ లతో నిలువెల్లా వెలిగిపోతూ కనిపించింది. మధుమూర్తి పరిస్థితి చాలాయిబ్బందిలో పడింది. యింక అక్కడ ఒక్క క్షణంవుండలేక పోకపోయాడు. గంధంవాసనతో మత్తుగానూ ముక్కుపొడుం వాసనతో ఘాటుగానూ ఉన్న ఆ వాతావరణంలో వుండలేక ఉక్కిరి బిక్కిరి అయి వెళ్ళొస్తాను అని అయినా చెప్పకుండా, చీడీల దగ్గర ఒదిలిన చెప్పుల్ని తొడుక్కోవడం కూడా మరిచిపోయి, అరుగుమీంచి ఒక్క ఉరుకు ఉరికి పరుగులాంటి నడక లంకించుకున్నాడు. "సన్నగా జల్లు పడుతోంది - యిప్పుడేం వెళతావు కాస్సేపు కూర్చో" అన్న మునెయ్య హెచ్చరికని ఏం చెవిని పెట్టకుండా, అతని వెనకాల మునెయ్యా కల్పవల్లి ఏం చెప్పుకున్నారో ఏమో వీధి మలుపు తిరిగేవరకూ వాళ్ళ నవ్వులు అతనికి వినిపిస్తూనే వున్నాయి.

ఆ షాక్ నుంచి తేరుకుని మళ్ళీ మామూలు మనిషి కావడానికి మధుమూర్తికి వారంరోజులు పట్టింది. ఆ తర్వాత పది పదిహేను రోజులకికాని అతనికి చిందబరం తటస్థ పడలేదు. వీధిలో కనిపించిన చిదంబరం భుజంమీద చెయ్యివేసి కాలువ ఒడ్డుకి తీసుకుపోయాడు మధుమూర్తి. అక్కడ కుర్చోబెట్టి ఆ కబురూ ఈకబురూ చెప్పి చివరికి అసలు ప్రస్తావన ఎత్తాడు. "నువ్వు రోజూ కల్పవల్లి ఇంటికి వెళుతున్నావుకదా! నువ్వూ ఆమే ఏకాంతంగా ఎన్నిసార్లో ఉంటున్నారు కదా! నువ్విలావచ్చి తన భార్యతో సరసాలాడి వెళుతూన్న సంగతి మునెయ్యకి తెలుసా! తెలిసి

నిన్నేం అనలేదా; ఎప్పుడేనా మీారిద్దరూ అతని కంటపడ్డారా అప్పుడతను ఏమన్నాడు" ఇలా ప్రశ్నమీద ప్రశ్న వేస్తూ పోతూన్న మధుమూర్తికి ఏం సమాధానం చెప్పాలో తెలియక కాస్సేపు తికమకపడి తర్వాత అన్నింటికీ అవునన్నట్లు తల ఊపి "ఇంతకీ ఎందుకు నన్నీ ప్రశ్నలు వేస్తున్నావు?" అంటూ అడిగాడు చిదంబరం. మధుమూర్తి వెంటనే తొట్రుపడి "అహా! అబ్బే!...మరేం లేదు నీకు లభించిన అవకాశం తెలుసుకుని 'ఆ...సరే...మనం కాకపోయినా మనవాడైనా ఆనందిస్తునాడు కదా అని సంతోషిద్దాం అని" అన్నాడు ముఖంలో ఏభావం కనపడ నియ్యకుండా.

కాస్సేపటివరకూ చిదంబరం మాట్లాడలేదు. ఆ తర్వాత "హుఁ...ఆనందం" అంటూ నిట్టూర్చాడు.

"ఏం అలా నిరుత్సాహంగా చప్పరిస్తావేం;"

కాకపోతే; ఇప్పటికి నాలుగు నెలల నుంచి రోజూ రెండు వేళలా కల్పవల్లి వాళ్ళింటికి వెళుతున్నా నా! నవ్వుతూ పలకరిస్తుంది చేసిన ప్రతి ఫలహారం పెడుతుంది. వేళాకోళం ఆడుతుంది. కేరింతాలు గొడుతు నాతో కేరమ్స్ ఆడుతుంది. ఆటమధ్యలో స్ట్రయికరు తీసుకున్నట్లూ, కాయిన్సు లాక్కున్నట్లూ వంకబెట్టి నా చెయ్యి పట్టుకుంటూ ఉంటుంది. ఒక్కొక్కప్పుడు నవ్వుతూ నా మీాద వాలిపోతూ ఉంటుంది..."

"ఇదంతా మునెయ్య ఇంట్లో లేనప్పుడా:" ఆసక్తిగా యికా దగ్గిరిగా జరుగుతూ అడిగాడు మధుమూర్తి.

"ఊహూఁ,...అతను చూస్తూ వుండగానే ... సకిలిం
పీలుస్తూ ఎదురుగుండా పుస్తకం చదువుకుంటూనే ఉంటాడు.
లేదా ఆ గదిలోంచి యీ గదిలోకి పచార్లు చేస్తూనేనా
వుంటాడు."

"మరి పెళ్ళాం నవ్వూ సాగిస్తూన్న ఈ సరసాలన్నీ
చూస్తూ ఏం అనకుండా వూరుకుంటాడా;"

"ఏం ఉంది అనడానికి ఇందులో."

"ఓరి నీ అసాధ్యం గూలా! ఎదురుగుండా ఇంత
తతంగం సాగుతూ భార్య నీతో వ్యభిచరిస్తూంటే"

"వ్యభిచారమా;" ఒక్క అరుపు అరిచాడు
చిదంబరం.

"మరి లేకపోతే యిదంతా పాతివ్రత్యమా," వెటకా
రంగా మందలించాడు మధుమూర్తి.

"అయ్యో రామా...అక్కడే ఉందయ్యా కథంతా....
మునేయ్యవుండగా యింతచనువుగా వుంటుందా నాతో-మళ్ళీ
అతను యింట్లో లేకపోయినా, అతను చూస్తూవుండకయిపోనా,
నాతో నవ్వుతూ మాట్లాడితేఒట్టు, అతి ముభావంగా అంటే
ముట్టనట్టు దూరంగా ఉంటుంది. సాయంత్రంపాకా నాతో
ఎంతచనువుగాఉన్నా ఇంకా తర్వాత నేను వెళ్ళిరానా"అంటే
నిక్షేపంలా" అంటూ నన్ను పంపించి తలుపు వేసుకుంటారు
వాళ్ళిద్దరూను. మునెయ్య ఊళ్ళో లేనప్పుడు ఒకటి రెండు
సార్లు చూశాను యిక్కడ వుండిపో యీ పూటకి అంటుం
దేమోనని...ఊహూ...పైగా యింకా చీకటి పడకుండానే

"చిదంబరం చీకటి పడుతోంది ఇంక యింటికి వెళ్ళు అంటూ నన్ను పంపించేసింది..."

"అయితే యిన్నాళ్ళనుంచీ ఉత్తుత్తి నవ్వులూ కేరింతాలే నన్నమాట...

"అంతకంటే ఏమైనా ఉంటే నేను చచ్చినంత ఒట్టు."

"చిత్రంగా వుందే!"

"నిన్నటిదాకా నేనూ అదే అనుకున్నాను... కాని నిన్న నాకు తెలిసింది. అసలు సంగతేవిటో ... వాళ్ళిద్దరూ డాక్టరుతో మాట్లాడుతుండగా విన్నాను..."

'ఏవిటీ' అన్నట్లు మధుమూర్తి ఆసక్తిగా ముఖం పెట్టాడు.

"అసలు సంగతేమిటంటే నన్నినాళ్ళూ ఆమునెయ్యా కల్పవల్లీ తమ అవసరం కోసం వాడుకున్నారు. ఆ మునెయ్యకి ఒక మానసిక వ్యాధి ఉందట. తన భార్యతో మరొవాడు సరసాలాడుతూండడం చూస్తేగాని అతనికి ఆమెపై వ్యామోహం రాదట. అందువల్లే రోజూ ఆమె నాతో ఇలా చనువుగా ఉండడం దగ్గరగా మసులుతూ కవ్వించడమూను. సాయంత్రందాకా ఇలా మునెయ్యకి ఉత్సాహం కలగడం కోసం ఆమె నన్ను ఒక ఆటవస్తువుగా ఉపయోగించుకోన డము ఆ తర్వాత నన్ను పంపించి వెయ్యడమున్నూ. ఈ నాలుగు నెలలనుంచీ జరుగుతూన్న ముచ్చటఇది. ఇంతకు మిక్కిలి ఏం లేదు...నామాట నమ్ము మధుమూర్తీ' అంటూ చిదంబరం కన్నీళ్లు పెట్టుకున్నాడు.

"నిజంగా!" అంటూ ఆశ్చర్యంతో పెద్దవిగా చేసిన మధుమూర్తి కళ్ళు ఆమట్టున అలా పెద్దవిగానే ఉండిపోయాయి. చిదంబరం చెప్పింది ఎంతవరకూ నిజం అన్న అనుమానం ఆ కళ్ళల్లోంచి ఇంకా పోనేలేదు.

లోకాన్నంతా అర్థం చేసుకున్నా ననుకుంటూన్న మధుమూర్తికి కల్పవల్లీ మునెయ్యా సరే మొదటే అర్థం కావటం లేదు.

వీడిలా వాళ్ళకి ఉపయోగపడి ఎందుకు ఊరుకున్నాడు? ప్రతి పురుషుడికీ ఉండే కోరికా, కోపం, పగా, కక్షా వీడికి లేవా? ఇంతకీ వీడు చెప్పింది ఎంతవరకూ నిజం? ఇలాంటి మనస్తత్వాలు ఉంటాయా? ఆమునెయ్యా కల్పవల్లీ ఎలాంటి మనస్తత్వం ఉన్నవాళ్ళు? ఏమిటి ఇదంతా?

మధుమూర్తి మనస్సులో ఈ అనుమానాలన్నింటికీ సంబంధించిన ఒక ప్రశ్నార్థకం ప్రశ్నార్థకంగా అలాగే మిగిలిపోయింది.